క్లుప్తంగా

ఈదులబందలో మొక్కలు నాటే కార్యక్రమం



మొక్క నాటుతున్న పీఎస్‌వో రామ్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: మండలంలోని వంచుల పంచాయతీ ఈదులబందలో ఉపాధి హామీ పథకం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం 700 మొక్కలు నాటారు. అమ్మ పేరిట ఒక మొక్క నాటే కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముక్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు పీఎస్‌వో రాంప్రసాద్‌తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి ఫీల్డ్ అసిస్టెంట్ కాంతారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్, కూటమి నాయకులు కొండబాబు, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు

కొయ్యూరు: చీడిపాలెంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో వందమందికి వైద్య పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఈ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మేరీరోజ్ మాట్లాడుతూ వచ్చేనెల 2వ తేదీ వరకూ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పీహెచ్‌ఎన్ భవానీ,ఏఎన్ఎంలు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలో పీహెచ్‌సీ వైద్యాధికారులు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న వైద్యాధికారులు

వై.రామవరం: జీవో నంబరు 85 రద్దు, 30 శాతం ఏజెన్సీ అలెన్సు కోరుతూ విజయవాడలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ దినేష్, డాక్టర్ నరేంద్రలు విజయవాడలో రిలే నిరాహార దీక్ష శిబిరంలో కూర్చొన్నారు.

రోగులకు రొట్టెలు, పండ్ల పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

చింతూరు: ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా బీజేపీ నాయకులు మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోట్ల వెంకన్న, మల్లేష్, ప్రసాద్, నాగార్జున, పొదయ్య, నగేష్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపనలు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సుభాష్‌చంద్ర

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ గుమ్మసిరగంపుట్టు,ధారపల్లి గ్రామాల్లో మంగళవారం సర్పంచ్ సుభాష్‌చంద్ర,వైస్‌ఎంపీపీ సత్యనారాయణ,గిరిజన సంఘం నేత శ్రీను సీసీరోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుభాష్‌చంద్ర మాట్లాడుతూ గుమ్మసిరగంపుట్టు,ధారపల్లి గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధలు రూ. 4లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్టు చెప్పారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఎటపాక: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచవలసిన బాధ్యత అందిరిపై ఉందని స్థానిక తహసీల్దార్ పృధ్వీ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రం ఎటపాకలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ గంగరాజు,ఏపీఎం స్వామి,ఏపీవో రాఘవయ్య పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : స్వచ్ఛతాహీ కార్యక్రమాలను విజయవంతం చేయాని స్థానిక ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వరావు అధికారులకు పిలుపు ఇచ్చారు. ఆయన మంగళవారం స్థానిక సర్పంచ్ రమణితో కలసి స్వచ్ఛతాహి ర్యాలీలో పాల్గొన్నారు.



దుంబ్రిగుడ పెట్రోల్ బంకు పక్కన ఉన్న చెత్తాచెదారం



దుంబ్రిగుడ ఆరోగ్యకేంద్రం రోడ్డులో పడేసిన వ్యర్థాలు



అరకులో వారపుసంత ప్రాంగణంలో...

చెత్త శుద్ధి ఏదీ?

గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. కాలువలు పూడుకుపోయి, రోడ్లపైకి మురుగు నీరు చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఎక్కడ చూసినా మురుగునీటి ప్రవాహం, చెత్తా చెదారం దర్శనమిస్తున్నాయి. దుంబ్రిగుడ మండలంలోని పల్లెలు కంపుకొడుతున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- పూడుకుపోయిన కాలువలు
- రోడ్లపైకి చేరుతున్న మురుగు
- ఎటుచూసినా చెత్తాచెదారమే
- పూర్తిగా క్షీణించిన పారిశుధ్యం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



దుంబ్రిగుడలో డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్త



కించుమండలో వ్యర్థాలతో పూడికుపోయిన డ్రైనేజీ

దుంబ్రిగుడ: మండలంలోని పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రోడ్లపై చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామాలు కంపుకొడుతున్నాయి. మండలంలోని 18 పంచాయతీల్లో సుమారు 60 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఏ పంచాయతీలోనూ డంపింగ్ యార్డులు లేవు. పంచాయతీల అధికారులు పారిశుధ్యంపై దృష్టిసారించడం లేదని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

- మండల కేంద్రం దుంబ్రిగుడలో గ్యాస్ గొడౌన్ వద్ద డంపింగ్ యార్డు ఉండేది. ఆ స్థలంలో ఇళ్లు నిర్మించడంతో చెత్తను ఎక్కడ వేయాలో తెలియక పెట్రోల్ బంకు పక్కన, జీసీసీ డీఆర్ డిపో వద్ద, ఆరోగ్యకేంద్రం రోడ్డు వద్ద, గుంటసీమ రహదారి వద్ద పడేస్తున్నారు.
- అరకు గ్రామ మేజర్ పంచాయతీలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. ప్రధానంగా వారపు సంత నిర్వహించే షెడ్ల వద్ద పారిశుధ్యం కొరవడి, తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. సంతకు వచ్చే గిరిజనులు, వ్యాపారులు ముక్కుమూసుకోవలసి వస్తోంది. ఈగలు విపరీతంగా వృద్ధి చెంది సంతలో విక్రయించే తినుబండారాలు, ఇతర ఆహారపదార్థాలపై ముసురుతున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.
- కించుమండ పంచాయతీలో అపారిశుధ్యం తాండవిస్తోంది. ఇప్పటికే ఈ పంచాయతీలో పలువురు వ్యాధుల బారిన పడ్డారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రధాన హైవేవద్ద చెత్త పేరుకుపోయింది. రోడ్లన్నీ అపారిధ్యంతో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో మురుగనీరు రోడ్లపై ప్రవహిస్తోంది.
- పోతంగి, కించుమండ, గసభ, గుంటసీమ పంచాయతీల్లో సేకరించిన చెత్తను దూరంగా డంప్ చేసేందుకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్లు మూలన పడి ఉన్నాయి. వాటికి తొట్టెలు ఇవ్వకపోవడంతో వినియోగించడం లేదు.
- చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు మండలంలో నాలుగు చోట్ల ఉన్నాయి. అవి వినియోగంలోకి రాలేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు, స్పందించి పారిశుధ్యంపై చిత్తశుద్ధి చూపాలని స్థానికులు కోరుతున్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాం



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాం. కొంత మంది గ్రామస్తుల సాయంతో పనులు ముమ్మరం చేశాం.పోతంగి, కించుమండ, గసభ, గుంటసీమ పంచాయతీలకు కేటాయించిన ట్రాక్టర్లకు సంబంధించి తొట్టెలు రాకపోవడంతో వాటిని వినియోగంచలేకపోతున్నాం.

– ఉషారాణి, ఎంపీడీవో, దుంబ్రిగుడ

రోడ్డుపైనే చెత్తాచెదారం



కించుమండ జీసీసీ డిపో ఎదురుగా అపారిశుధ్యం తాండవిస్తోంది. ఈ రోడ్డులోనే చెత్తాచెదారాన్ని విపరీతంగా డంప్ చేస్తున్నారు. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఎన్ని సార్లు పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు.

– హెచ్‌బి. రామనాయుడు, గ్రామస్తుడు, కించుమండ

చట్రాపల్లి బాధితులకు జెడ్పీటీసీ పరామర్శ



చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ బాలయ్యపడాల్

చింతపల్లి: జీకే వీధి మండలం చట్రాపల్లిలో కొండచరియలు విరిగిపడడంతో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను స్థానిక జెడ్పీటీసీ బాలయ్యపడాల్ మంగళవారం పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుణబాబు, బాబీ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉద్యోగికి సన్మానం



మాట్లాడుతున్న సీఈ వాసుదేవరావు

మోతుగూడెం: స్థానిక చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న పి.నాగేశ్వరరావుకు డిప్యూటీ సెక్రటరీగా పదోన్నతి లభించింది. పదోన్నతిపై విద్యుత్ సౌధ విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక సీఈ కార్యాలయంలో సీఈ వాసుదేవరావు ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. గత ఐదేళ్లుగా సీలేరు కాంప్లెక్స్‌లో ఎంతో నిబద్ధతతో సేవలు అందించారని సీఈ కొనియాడారు. పదోన్నతిపై వెళుతున్న అసిస్టెంట్ సెక్రటరీ నాగేశ్వరరావును విద్యుత్ ఇంజినీర్లు, సీఈ ఆఫీస్ సిబ్బంది, విద్యుత్ కార్మికులు నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈఓఅండ్ఎం చిన్న కామేశ్వరావు, ఈఈ బాలకృష్ణ, వరప్రసాద్, డీఈ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



పెదవలసలో విద్యార్థితో మాత్రలు మింగిస్తున్న పెదవలస వైద్యసిబ్బంది



దుంబ్రిగుడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మాత్రలను వేస్తున్న సీడీపీవో నీలిమ



కిల్లోగుడ పీహెచ్‌సీలో మాత్రలను వేయిస్తున్న వైద్య సిబ్బంది



విద్యార్థినిచే నులిపురుగు నివారణ మాత్రలు మింగిస్తున్న కిలగాడ వైద్య సిబ్బంది



కోతులగుట్ట కేజీబీవీలో విద్యార్థినులతో మాత్రలు మింగిస్తున్న ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ విజయ

గూడెంకొత్తవీధి: జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలోనూ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పెదవలసలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు మంగలక్ష్మీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సీడీపీవో నీలిమ నులిపురుగుల నివారణ మాత్రలను మంగళవారం మింగించారు. స్థానిక కేజీబీవీ, బాలుర ఆశ్రమ పాఠశాల, కిల్లోగుడ పీహెచ్‌సీలో పలువురికి వైద్య సిబ్బంది మాత్రలను పంపిణీ చేశారు. ఎంపీఈహెచ్‌వో శౌరి, హెల్త్ సూపర్‌వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ స్వామి, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, ఏఎన్ఎంలు ప్రసన్న, కిరణ్మయి, ఆశ కార్యకర్తలు మేరీ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలో అన్ని పాఠశాల్లోని విద్యార్థులతో మాత్రలు మింగించే కార్యక్రమాని వైద్య సిబ్బంది మంగళవారం చేపట్టారు. లంబసింగి, తాజంగి, కోరుకొండ, లోతుగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న పాఠశాలల్లో ఈ మాత్రలను విద్యార్థులతో మింగించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రమణి, లంబసింగి ఎంపీహెచ్ఈవో మురళి, హెల్త్ సూపర్‌వైజర్ నాయుడు, ఆర్‌వినగర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ కేజీబీవీ, బంగారుమెట్ట, పెదగూడ, మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలను వైద్య సిబ్బంది వేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 4,800 మంది చిన్నారులకు మాత్రలు అందిస్తున్నట్టు చెప్పారు.

కూనవరం: విద్యార్థులు, చిన్నపిల్లలు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కోతులగుట్ట కేజీబీవీలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కాగా కూనవరం, కూటూరు పీహెచ్‌సీల పరిధిలో 5,470 మంది పిల్లలకు మాత్రలు వేసినట్లు హెల్త్ సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు తెలిపారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

మండల సమావేశంలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



హాజరైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: మండల పరిధిలోని గ్రామాల్లో పర్యటించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. ఎంపీపీ రంజపల్లి ఉషారాణి అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, వ్యవసాయ భూములకు సాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు లేని గ్రామాలను గుర్తించి రోడ్లు నిర్మించాలని సూచించారు. అరకులోయ పట్టణంలో పుట్‌పాత్‌లు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాదచారులు రోడ్లపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి పుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని తెలిపారు. పెదలబుడు, పద్మాపురం పంచాయతీల పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని, పంచాయతీ ఈవోలు, మరికొంతమంది ముడుపులు తీసుకుని వాటిని అనుమతించారని ఆరోపించారు. అటువంటి అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోలన్నారు. పెదలబుడు గ్రామ పంచాయతీకి ఏపీ టూరిజం శాఖ చెల్లించాల్సిన పన్నులపై ఆరా తీశారు. టూరిజం యూనిట్లకు నోటీసులు జారీ చేయాలని, అప్పటికి చెల్లించకపోతే తాళాలు వేయాలని సూచించారు. అరకులోయ పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎంపీటీసీ నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లను నిరుద్యోగ యువతకు కేటాయించాలని ఎంపీడీవోకు సూచించారు. జెడ్పీటీసి శెట్టి రోషిణి, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీడీవో వెంకటేష్, ఎంఈఓ త్రినాథరావు, ఈవోపీఆర్‌డీ వెంకటరావు, సీడీపీవో శారద, ఇంజనీరింగ్ శాఖల ఏఈఈలు అభిషేక్, వినీల, సత్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం

జి.మాడుగుల: మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గణేష్‌ని నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎం.నిట్టాపుట్టులో సోమవారం రాత్రి దీపోత్సవం, మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. జి.మాడుగులలో పాత ఎమ్మార్వో ఆఫీస్ కాలనీలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 11రోజుల పాటు గణేష్‌ని ఉత్సవాలు నిర్వహించి, అనంతరం ఘనంగా నిమజ్జనోత్సవం జరిపారు. బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాలు, థింసా, ఇతర నృత్యాలు, పలు విన్యాసాల నడుమ ఊరేగింపు నిర్వహించారు.



మంటలతో విన్యాసం



జి.మాడుగుల వీధుల్లో గణేష్‌ని ఊరేగింపు

పోటాపోటీగా లడ్డూ వేలంపాట



పాతగంగవరం రామాలయంలో లడ్డూ వేలం పాడిన భక్తుడు వెంకటేశ్వర్లు

గంగవరం : పాత గంగవరం రామాలయంలో వినాయక మండపం వద్ద మంగళవారం లడ్డూ వేలం పాట పోటాపోటీగా జరిగింది. రూ 4,200కి స్థానిక వ్యాపారి వెంకటేశ్వర్లు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ యువకులు ఘనంగా నిర్వహించారు.

ప్రత్యేక భజన కార్యక్రమం

చింతపల్లి: స్థానిక ముత్యాలమ్మ వీధిలో వినాయక మండపం వద్ద ప్రత్యేక భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చౌడిపల్లి పంచాయితీ మాజీ సర్పంచ్ దేవూరు వెంగళయ్య ఆధ్వర్యంలో రత్నగిరి కాలనీ భజన బృందం వారిచే ప్రత్యేక కార్యక్రమని ఏర్పాటు చేశారు. వర్తక సంఘం నాయకులు బేతాళుడు, నాగేశ్వరరావు, వైస్ సర్పంచ్ నూరు మాజీ ఎంపీటీసీ రామూర్తి పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న యువకులు

గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

రంపచోడవరం: గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధిచెందాలని, అందుకు వారికి ప్రోత్సాహం ఇవ్వాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో పీవో మాట్లాడారు. అన్ని మండలాల్లో ఈ-క్రాప్, ఈకేవైసీని గిరిజన రైతులతో చేయించాలని తెలిపారు. సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు భూములు గుర్తించాలని సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు.

సందడిగా పీఎం ఆవాస్ యోజన గృహ ప్రవేశాలు

రాజవొమ్మంగి/జి.మాడుగుల: పీఎం ఆవాస్ యోజన గృహ ప్రవేశాల కార్యక్రమాలు రెండు మండలాల్లో మంగళవారం అట్టహాసంగా జరిగాయి. రాజవొమ్మంగి మండలం శరభవరంలో జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకట లక్ష్మి, సర్పంచ్ రాజ్యలక్ష్మి, బీజేపీ మండలనాయకులు సూరిబాబు పాల్గొన్నారు. మండలానికి పీఎం ఆవాస్ యోజన కింద 276 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 47 ఇళ్ల నిర్మాణం పూర్తి అయినట్లు కార్యక్రమానికి హాజరైన హౌసింగ్ ఏఈ వెంకట్రాజు తెలిపారు. మాజీ సర్పంచ్ లక్ష్మణరావు, లబ్ధిదారు ముర్ల రామలక్ష్మి పాల్గొన్నారు. జి.మాడుగుల మండలంలో పాలమామిడి పంచాయతీ లక్కుళ్ల గ్రామంలో గృహప్రవేశ కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ డి.ఈశ్వరరావు, సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ అప్పారావు,మాజీ సర్పంచ్ భాస్కరరావు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



లక్కుళ్లు లో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రామకృష్ణ, హౌసింగ్ సిబ్బంది



శరభవరం గ్రామంలో గృహప్రవేశం చేస్తున్న ప్రజాప్రతినిధులు